# దైవ ఘటన

★



రచన :

* శ్రీ కూతురు రాం రెడ్డి. *

ప్లాస్టిక్ బుట్టను రెండు చేతుల్తో పట్టుకోని ముందు మోకాళ్ళ పైకిపెట్టుకుని, వచ్చే పోయే మనుష్యుల్ని చూస్తూ అటూఇటూ తచ్చాట్లాడుతుందామె.

ఎవర్నో ఏదో అడగాలనుకుంటుంది. సిగ్గు, అభిమానం అడ్డొచ్చి, అడక్కుండానె విసుగ్గా, బితుకు బితుగ్గా చూస్తోంది.

పది గజాల దూరంలో ఉన్న నేను, ఆమె ప్రతి కదలికని, మొహంలో కలిగే మార్పుల్ని పరీక్షిస్తున్నాను. పాపం! ఊరికి కొత్తేమో, వెళ్ళి పరామర్శించి ఆమె సందేహాన్ని తీరుస్తే?... బెడిసికొడుతుందేమో నని భయం వేసింది. ఆడవారి మనస్సును చదువలేము. వాళ్ళ మనస్సు ఎప్పుడు, ఎలా మారుతుందో చెప్పలేము ఆపదలో ఉందేమో, ఆదుకోవాలని చూస్తే, చెడామడా తిట్టె వారున్నారు, మెచ్చుకునేవారున్నారు.

ఒకసారి నేనూ, నామిత్రుడు మూర్తి పిచ్చాపాటి మాట్లాడుకుంటూ వెళ్తున్నాము. మా ఎదురుగా ఒక అందమైన అమ్మాయి నడిచివస్తూ_అరటి తొక్కమీద కాలువేసి జారి రోడ్డుపై పడింది. ఆమె చేతిలోని పుస్తకాలు, చిందరవందరగా రోడ్డుమీద పడిపోయాయి ఒక్కసారిగా "అమ్మా" అని నడుం పట్టుకుంది. మూర్తి గబాగబా వెళ్ళి, రెండుచేతులు పట్టి ఆమెను లేవనెత్తాడు. దెబ్బబాగా తగలడంవల్ల ఆమె సరిగా నిలబడలేక పోతుంది. నేను పుస్తకాలన్నీ ఒకదగ్గర చేర్చి పట్టుకున్నాను. ఐదునిముషాల్లో ఆమె అతికష్టం మీద నిలబడగల్గింది. నేను పుస్తకాలు ఆమెచేతికిచ్చాను. కృతజ్ఞత చెప్పి వెళ్ళిపోతుందనుకున్న ఆమె_నిలువెల్లా కోపం నింపుకొని, ఎర్రగామారిన కళ్ళతో మూర్తికేసి చూస్తూ "బ్రూట్స్" అరటితొక్క నాముందు పడేసి నేను పడిపోతే, నన్నుముట్టుకొని, మీ ప్రతాపం చూపెట్టుకోవాలనుకున్నారు కదూ!" అంటూ చకచకా ముందుకు దూసుకుపోయింది. మా యిద్దరి తలలూ గిర్రున తిరిగాయి. వెర్రిగా ఒకరి మొహం ఒకరు చూసుకుంటూ నించుండి పోయాము.

ఈ అమ్మాయికూడా అలాగే చేస్తే?

ఎవడికి లేని ఇంటరెస్ట్ నాకేంలే? అనుకుని_బస్సొచ్చే సరికి కాస్తటైం పాసైనా అవుతుందని, ఓపత్రిక కొనుక్కొని పేజీలు తిరగేస్తూ, ఆమెకు దగ్గరగా ఉన్న బెంచీపై కూర్చోవాలని అటుకేసి నడువసాగాను. ఇంతలో ఆమె ముందునుంచి వెల్తున్న ముసలాయన్ని

ఏదో అడిగింది అతడు నాకు తెలియదన్నట్లు తలూపి వెళ్ళిపోయాడు.

"ఎక్కడికెళ్లాలండీ?"

ఇక నేను పలకరించకుండా ఉండలేక పోయాను.

ఆమె "దుద్దెన పల్లకి వెళ్ళాలండీ. గంట సేపటినుండి ఒక్క బస్సుకూడా రావటంలేదు చీకటి పడుతోంది. బస్సుదిగాక మైలున్నర నడిచి వెళ్ళాలి" అంది.

బస్సురాకపోతే తనేంచేయాలో-వచ్చినా చీకట్లో ఒంటరిగా మైలున్నర ఎలానడవాలో అర్థంగాక నిలువెల్లా వణికిపోతున్నట్లనిపించింది ఆమె.

దుద్దెన పల్లికి ఉదయం పదిన్నరకు ఒకబస్సు, సాయంత్రం ఐదుగంటలకు ఒకబస్సు ఉంటుంది. సాయంత్రం బస్సు ఎప్పుడో వెళ్ళిపోయింది. ఈవిషయమే ఆమెతో చెబితే ఏడ్చినంత పనిచేసింది. ఆమె మొహం చూస్తే నాకు చాలా జాలేసింది.

"మీ కెరిగున్న వారెవరైనా ఉన్నారా, ఇక్కడ?" అడిగాను. ఆమె "ఎవరూలేరు" అని కాస్సేపులాగి "పదినిముషాల ముందునుండి మీరుతప్ప" అంది.

ఆమె పెద్దజోక్ వేసినట్లనిపించింది. నవ్వాలని ప్రయత్నించకుండానే నవ్వొచ్చింది. చిన్నగానవ్వి ఆమెకేసి చూశాను. జోక్ వేసినట్లులేదామె మొహం. నేను నవ్వినందుకేమో, కాస్తఏడుపు మొహం పెట్టినట్లనిపించింది. "మీరు దుద్దెనపల్లికి వెళ్ళాలంటే బస్సు రేపు పదిన్నరకుంది. ఆ బస్సు మావూరు "సైదాపూర్" నుండే వెళ్తుంది. మీకు అభ్యంతరం లేకపోతే ఇప్పుడు నాతో మా ఊరురండి. రేపు ఆబస్సును క్యాచ్ చేసి మీవూరు వెళ్ళొచ్చు".

నామాటల కామెం మాట్లాడలేదు.

"మీకు రాత్రంతా బోర్ కొట్టకుండా మా అత్తయ్య ఉంది. ఆమెచాలా తమాషా ఐన మనిషి. ప్రేమ హృద

G.E.M

జి. యి. ఎం.

స్టార్టర్లు మరియు స్విచ్చులనే

అమర్చండి.

టి. పి. ఐ. సి. స్విచ్చులు :—
15 నుంచి 200 ఆంప్స్ వరకు.

ఇనుము క్లాడ్ స్విచ్చులు :—
15 నుంచి 200 ఆంప్స్ వరకు-ట్రిపిల్ పోల్.
15 నుంచి 30 ఆంప్స్ వరకు-డబుల్ పోల్.
15 నుంచి 30 ఆంప్స్ వరకు-ఛేంజ్ ఓవర్.

★

డి. పి. సి. పుష్ బటన్ స్టార్టర్ :—1 నుంచి 8 ఆంప్స్ వరకు.
డిస్ట్రిబ్యూషన్ బోర్డులు మొదలైనవి.



: వివరములకు :

Ganapathy Engineering Manufacturers (P) Limited

GANAPATHY, Post Box No. 6 COIMBATORE-641 006.

Phone: 23024 : : Tel: "POLESTAR"

యం. ఒక్కరోజు ఉంటే — మీరెప్పుడూ అక్కడే ఉండాలనిపిస్తుంది లెండి"...

ఇంకా మా అత్తయ్యగురించి ఆవేశంగా చెబుతుండగానే బస్సువచ్చి ఆగింది. జనం ఎక్కువగాలేదు. బస్సు సగంవరకు ఖాళీగా ఉంది. నలుగురు ప్రయాణీకులు ఎక్కి కూర్చున్నారు, కండక్టరు టికెట్లిస్తున్నాడు వారికి.

"కండక్టరు బస్సుదిగలేదు. తొరగా కదులుతుందేమో గత్యంతరం లేక బస్సులోకెక్కింది.

కండక్టరుకు పదిరూపాయల నోటిచ్చి రెండు టికెట్లు తీసుకున్నాను. ఐదునిమిషాల్లో బస్సుకదిలింది.

♦ ♦ ♦

"రండి, లోపలికి రండి!" అన్నాను, ఆమె గుమ్మం దగ్గరే తటపటాయించడం చూసి. ఆమె లోపలికి వచ్చి గోడలకు తగిలించి ఉన్న దేవుళ్ళ క్యాలెండర్లకేసి చూడసాగింది.

"మీరు కొత్తగా భావించకండి మీ ఇంట్లో మెదలినట్లు స్వేచ్ఛగా మసలుకోవచ్చు" అని నేను వంటింట్లో కెళ్ళి అత్తయ్యతో విషయం చెప్పాను. అత్తయ్య కంటిఅద్దాలు సరిచేసుకుంటూ ఆవిడ దగ్గరకొచ్చి చనువుగా మాట్లాడింది. ఆవిడ దగ్గరున్న బుట్టను తీసి కళ్ళి లోపలపెట్టి టిఫిన్ చేయడానికి కాళ్లూ, చేతులు కడుక్కోమంది. ఆమె బావిదగ్గరకొచ్చేసరికి నేను నీళ్ళు తోడుతున్నాను.

"నేను తోడుతాను. చేద ఇలా ఇవ్వండి." అంది. నేను నవ్వి "మీకోసం నేను నీళ్ళుతోడడం లేదులెండి" అన్నాను. "ఇదిగో నన్ను "మీరు" అని సంబోధించకండి నాకెలాగో ఉంది చక్కగా "మాధవి" అని పిలవండి చాలు" అందామె చిరుకోపం నటిస్తూ. బకెట్ నిండా నీళ్ళుతోడి, ముందు ఆమెను కడుక్కోమన్నాను.

"అయితే ఒలకబోస్తానులెండి" అంటూ బకెట్ పట్టుకోబోయాను. ఆమె చిలిపిగా నవ్వుతూ నన్ను వారించి కాళ్ళూ, చేతులూ మొహం కడుక్కొని లోపలి కెళ్ళింది. అత్తయ్య అందించిన టవల్ తో మొహం తుడుచుకొని, అద్దం ముందుకెళ్ళి, కురులుదువ్వుకొని పౌడర్ అద్దుకొని — అలంకరణ అయిపోయినట్లు అలాగే అద్దం ముందునుంచొని విశాదంగా తన ముఖాన్ని చూసుకోసాగింది. అలాఎంతసేపు నించుందో తనకే తెలియదు. ఇంతలో అత్తయ్య ఏదో పలకరిస్తూ ఆవిడదగ్గరకొచ్చింది. మాధవి తేరుకొని మొహం మీది విశాదాన్ని మాపుకునే ప్రయత్నం చేసింది. అత్తయ్య ఆమెకేసి తేరిపారగా చూస్తూ "బంగారం బొమ్మలా ఉన్నావమ్మా", అంది. అంతలోనే విప్పారి ఉన్న ఆమె మొహం ఆవేదనతో ముడుచుకుపోయింది. కళ్ళల్లోనీళ్ళు తిరిగాయి. అద్దాలుతీసి కొంగుతో కళ్ళనొత్తుకుంటూ — "అచ్చం మా అమ్మాయి ఇలాగే ఉండేదమ్మా. ఇదేరంగు ఇదేపొడుగు. మొహంలో ఇదేకళ వయసులోకొచ్చాక హఠాత్తుగా పోయింది. చిన్నప్పటినుండి దానితో చెట్టాపట్టాలేసుకుని, దాన్నే పెళ్ళిచేసుకోవాలన్న మా సారథి కలలు కలలై పోయాయి. ఉన్న ఒక్కగానొక్క కూతురు పోయింది. అదిజ్ఞాపకం వచ్చినప్పుడల్లా గుండె తరుక్కుపోతుంది" అంది. ఆమెకళ్ళలోనినీరు ఇక ఆపుకోన్నా ఆగలేదు.

మాధవి కళ్ళల్లో అప్రయత్నంగా నీరూరింది. ఆమెను ఎలా ఓదార్చాలో తెలియలేదు.

"అయ్యో! నామతి మండిపోనూ. నా బాధంతా చెప్పి నిన్ను బొట్టు పెట్టుకోనీయకుండా చేశాను." అంటూ అద్దం ముందున్న కుంకుమ బరిణెను చేతిలోకి తీసికొని, కుంకం తీసి ఆమెనుదుట పెట్టబోయింది.

హఠాత్తుగా ఆమెచేతిని అలాగేపట్టుకుని ఆమెకేసి చూస్తూ వారించింది. మాధవి అప్పటివరకు నిండివున్న మాధవి కళ్ళలోని నీరు ఒక్కసారిగా బయటికి దూకింది. ఉబికివస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ అద్దంకేసి తిరిగింది.

అత్తయ్య ఎత్తిన చేతిరెండు వ్రేళ్ళ మధ్యనున్న కుంకుమ క్రిందికిరాలింది. వణుకుతున్న ఆమె చేయి మెల్లగా క్రిందికి దిగింది.

"అర్థమయిందమ్మా! అర్థమయింది" అంటూ ఆవిడను తనవైపు త్రిప్పుకొని గుండెకేసి అదుముకుంది. ఓదార్చాలనుకుంది కాని, బరువుతో నిండిన ఆమె గుండెలోంచి, వణుకుతున్న ఆమె పెదవులలోంచి ఏమాటా బయల్పడలేదు.

మొహాన్ని టవల్ తో తుడుచుకుంటూ, ఇంట్లో అడుగుపెట్టి, వారిద్దరినీ చూసి అవాక్కైపోయాను. పరిస్థితి విషాదంగా అనిపించింది. అత్తయ్య, మాధవి

మొహాలు వాడిపోయినట్లున్నాయి. అలాంటి పరిస్థితిలో వారిని పలకరించడము సుతరాము నాకు ఇష్టంలేదు అక్కడి నుండి కాస్తా దూరంగా తప్పుకోవడానికి ప్రయత్నం చేస్తూ, ప్రక్కగదిలోకి వెళ్ళాను. అత్తయ్య, మాధవికేవో ఓదార్పు మాటలు చెబుతుంది. ఆమెను నవ్వించడానికి ప్రయత్నం చేస్తుంది అసలు పరిస్థితేమిటో నాకర్థంకావటంలేదు. ఎంత ఆలోచించినా అంతు చిక్కడం లేదు.

కిటికీలోంచి బయటికి చూస్తూ, ఆలోచిస్తుండగా అత్తయ్య "ఉప్మా వడ్డించాను, త్వరగా కానీయ్ బాబూ!" అంటూ నాగది దగ్గరికొచ్చి వెళ్ళిపోయింది.

నేను గబగబా తయారై వంటింట్లో కెళ్ళేసరికి, మాధవి పీటపైకూర్చుంది. మరో పీటపై నేను కూర్చున్నాను.

అత్తయ్య రెండు ప్లేట్లలో ఉప్మా వడ్డించి, మా ముందుంచింది. ఏమ్మా! నీకు పచ్చడి ఆవకాయకావాలా? నిమ్మకాయకావాలా?" అంటూ మాధవినడిగింది.

"ఉప్మాలోకి మీరు ఏది వాడతారు? అంటూ నా వేపు చూస్తూ అడిగింది మాధవి. పీట మీద కూర్చున్నప్పటినుండి ఆమె మొహమైనా చూడని నేను పరీక్షిస్తున్నట్లనిపించింది. ఆమె మొహంలో ఎప్పటి కళస్థావరం చేసుకుంది "విచిత్రమైన మనిషి".

"చెప్పండీ"

"ఆఁ...అవునూ, అత్తయ్యా నేను ఉప్మాలో ఏపచ్చడి వాడతాను." తడబడతూ అత్తయ్యవైపు చూస్తూ అడిగాను.

నామాటలకి అత్తయ్యా, మాధవీ పెద్దజోక్ దొరికినట్లు నవ్వారు.

"ఏమిటో పరధ్యాన్నం" అంటూ అత్తయ్య ఆవకాయ పచ్చడి నాకూ, మాధవికి వడ్డించింది. నేను గబగబా పూర్తి కానిచ్చి, ప్లేట్ లో చేయి కడుక్కొని, గది నుండి బయటికొచ్చి, ముందుహాల్లో కూచున్నాను.

" అత్తయ్య మాధవికి ఏవేవో కబుర్లు చెబుతుంది ఆవిడ శ్రద్ధగా వింటూ పగలబడి నవ్వుతుంది. అప్పుడప్పుడు మాధవి చేప్పే కబుర్లకు అత్తయ్యకూడా నవ్వుతుంది. ఆ నవ్వుల్లో నేను పాలు పంచుకోలేక పోతున్నాను ఎందుకో. ఇప్పుడు మాధవి మొహం చూడాలంటోనే సిగ్గుగా ఉంది, పిరికివాణ్ణి నాకు నేను తిట్టుకున్నాను.

వేసవికాలం కావడం వల్ల అత్తయ్య పడకలు డాబాపై వేసింది. భోజనాలయ్యేసరికి రాత్రి ఎనిమిది గంటలు దాటింది. నేను పక్కపొడినముల్తూ, ముందు హాల్లో కూర్చొని, పత్రిక తిరగేస్తున్నాను ఏదైనా కథ చదవడానికి మనస్సు నిలకడగా ఉండడంలేదు. మాధవి చుట్టూ పదేపదే పరిభ్రమిస్తున్నది మనస్సు. సాయంత్రం ఆమె ఎందుకేడ్చినట్లు? ఇష్టంలేని పెళ్ళికుదిర్చినందుకు. తల్లిదండ్రులకు దూరం కావాలని పారిపోతుందా???

ఇంతలో మాధవి నాదగ్గరి కొచ్చి అత్తయ్య మీద కంప్లెంట్ చేసింది "చూడండి, మీ అత్తయ్య నన్నే పనీ చేయనియ్యడంలేదు తినికూర్చోవాలంటే నాకు తిన్న అన్నం అరగదు'. అంటూ.

ఆమె మాటలు నాచెవుల్లోకి దూరడం లేదు. "కూర్చోండి" అన్నాను ఎదురుగా ఉన్న కుర్చీని చూపిస్తూ.

మాధవి కూర్చుంది, "పత్రిక చదువుతున్నారా?" అంది నేనేం సమాధానం చెప్పలేదు. జంకకుండా, చనువుగా నాచేతిలోని పత్రిక తీసుకొని పేజీలు తిరగేస్తుంది ఆమెకేసి సూటిగా చూడసాగాను. మాధవి మొహం ఎంతో ప్రశాంతంగా ఉంది. ఏ బాధలూ, వ్యథలూ, ఆమె మొహంలో పులుముకున్నట్లు లేవు. విశాలమైన కళ్ళపై కనుబొమలు తీర్చిదిద్దినట్టున్నాయి ఆమె చెక్కిళ్ళపైనాకు వింత వెలుగు కనిపిస్తున్నది. ఆమె పెదవుల ఎరుపు, మొహచ్ఛాయను చూస్తూంటే, మా అత్తయ్య కూతురు కాంతిని చూస్తున్నట్లనిపించింది. ఇప్పుడు మాధవి లాక్కున్నట్టే కాంతి, బావను కావడం వల్ల మరింత చనువుగా నాపైకి ఎగబడి నవల లాక్కుంది_ఒకసారి. నేను ఆటపట్టించడానికి ఆమెచేతిలోంచి తిరిగి నవల లాక్కొని ఆమెకు అందకుండా చేతులు వెనుక్కి పెట్టుకున్నాను. కాంతి ఆపుస్తకాన్ని ఎలా లాక్కోవాలో కొద్దికాలం పాటు ఆలోచించి, ఒక్కసారిగా నన్ను పెనవేసుకొని, నాచేతుల్లోని పుస్తకాన్నిలాక్కొని, విజయం సాధించినట్లు కిలకిలా నవ్వుతూ తనగదిలో కెళ్ళిపోయింది.

కొద్ది నిముషాల పాటు ఆమె కౌగిలిలో ఇమిడిపోయిన నేను_సంఘటనను ఊహించుకొంటూ తీయని అనుభూతిలో, అరగంట సేపు ఆనంద డోలికల్లో తేలియాడాను.

రోజులు గడచిన కొలది, కాంతిని క్షణమైనా చూడకుండా ఉండలేకపోయాను. మమ్మల్నిద్దరినీ కలిపే కాలం అతి త్వరగా రావాలని కోరుకున్నాను. కాని...... కాని......

నా కళ్ళల్లో నీళ్ళు తిరిగినవి.

"ఏమిటో... దీర్ఘంగా ఆలోచిస్తున్నారు" అంది మాధవి పుస్తకంలోంచి తలెత్తకుండానే.

ఆమె రూపం నా కన్నీటి తెరల నుండి మసక మసగ్గా కనిపిస్తోంది. అలాగే చూస్తూ నిశ్చలంగా ఉండిపోయాను.

"మూగనోము పట్టారా?" అంటూ తలెత్తింది మాధవి. నా కళ్ళల్లోని నీళ్ళు ముందుకు దూకింది. ఆమె గమనించకూడదని ప్రక్కకు తిరిగి కళ్ళు తుడుచుకున్నాను.

అది గమనించిన మాధవి పరిస్థితి అర్థంగాక పత్రిక చదవడంలో లీనమైపోయింది.

◆ ◆ ◆

మాధవికి చాలా రాత్రి వరకు నిద్ర పట్టలేదు కబుర్లు చెబుతూ, చెబుతూ అత్తయ్య పదిగంటల ప్రాంతంలో పడుకుని గుర్రు పెడుతుంది.

చుక్కల్లో నిండు ఛంద్రుడు, తెల్లటి మేఘాల్ని దాటుకుంటూ వెళ్తున్న తీరును పరధ్యానంగా చూస్తున్నాను నేను.

డాబాపైకి పరుచుకున్న వేపచెట్టు చల్లని గాలిని వీస్తుంది. వాతావరణం ఎంతో హాయిగా ఉంది. కళ్ళు మూసుకొని లోకాన్ని మరచి నిద్రపోదామంటే రావడం లేదు, కళ్ళల్లో అనుక్షణం మాధవి కదలాడుతుంది.

ఆమె రూపం నా మనస్సును అయస్కాంతంలా లాగుతుంది. ఆమెతో తెల్లవారే వరకూ కూర్చొని ఏదేదో మాట్లాడాలని మనస్సు తపన పడుతుంది.

అర్ధరాత్రి పన్నెండు గంటల ప్రాంతంలో మాధవి లేచి, పడకపై కూర్చొని, తలని రెండు మోకాళ్ళపై ఆన్చి ఏదో ఆలోచిస్తుంది.

నేను ఆమెను గమనిస్తూ చూస్తున్నాను. నేనూ, అత్తయ్యా గాఢ నిద్రలో ఉన్నామనుకుంది మాధవి.

పది నిముషాల తర్వాత అక్కడినుండి లేచి, డాబా పిట్టగోడపై కూర్చుంది.

(6)

ELLEN యెలెన్ ISI

మోటార్లు మరియు పంపులు

ఆంధ్ర ప్రభుత్వముచే అధికారము పొందయున్నది.



Manufacturers of :-
Single Phase Motors, 3 Phase Motors Centrifugal Pumps, Domestic Pumps, Domestic Mono Blocks and Jet Pumps, Jet Mono Blocks.




FOR PARTICULARS
ELLEN INDUSTRIES
Peelamedu, Coimbatore - 641 004.

: బ్రాంచి :

యెలెన్ ఇండస్ట్రీస్

7-8-177, ఘస్మండి, సికిందరాబాదు-3 (ఎ.పి.)

"క్రొత్త ప్రదేశం కనుక నిద్రరావడం లేదా? మాధవీ" అంటూ లేచి వెళ్లి ఆమెకు ఎదురుగా కూర్చొని ఆమె మొహంలోకి చూశాను.

నిండు వెన్నెల్లో సనుపాటి ఆమె చెక్కిళ్ళపై కన్నీటి ధారలు మెరిసిపోతున్నాయి. ఆమె హృదయం పిండుకుపోతుంది. ఎదురుగా కూర్చున్న నన్ను చూసి కొంగుతో కన్నీళ్ళు తుడుచుకుంది.

"మాధవీ!" వ్యధలూ, బాధలూ ప్రతి మనిషికీ ఉంటాయి. కాని కొందరికి తక్కువ, కొందరికి ఎక్కువ అంతే. వాటిని గుండెల్లో దాచుకొని ధైర్యంగా మసులు కోవాలి గాని, హృదయాన్ని కరగించి కన్నీటి రూపంగా బయల్పరచడం, పిరికివాళ్ళ లక్షణం...బాధ పడకు." ఓదార్పుగా నా చేయి అనుకోకుండా ఆమె భుజంపైకి వెళ్ళింది.

నా కర స్పర్శకు ఆమె పులకించిపోయింది.

ఒక్క సారిగా వికసించిన మొహం పైకెత్తి, నా కళ్ళల్లోకి సూటిగా చూడసాగింది.

ఆమెలో నా కాంతి కనిపిస్తుంది.

వేపచెట్టు వీస్తున్న చల్లటి గాలికి శరీరం గిలిగింతలు పెడుతుంది.

ఆకాశంలో చంద్రుడు నల్లటి మబ్బు చాటుకి దాగాడు.

కాంతి,......నా కాంతి......

నా మనస్సు స్వాధీనం తప్పింది.

మాధవిని హత్తుగా కౌగిలిలో ఇముడ్చుకున్నాను. ఆమె వారించలేదు.

వెక్కి వెక్కి ఏడుస్తుంది మాధవి.

"నన్ను క్షమించు మాధవీ! అనుకోకుండా నా మనస్సు స్వాదీనం తప్పింది. నీలో నా కాంతి కనిపించి నన్ను పిచ్చివాణ్ణి చేసింది...మాధవీ! ఒక విషయం చెప్పు నేనంటే నీకు ఇష్టమేనా?"

మాధవి ఒక్క సారిగా నావైపు తిరిగింది.

"నిన్ను పెళ్ళి చేసుకుంటాను మాధవీ!"

ఈ మాటలకు మాధవి బెదిరిపోయింది. పిచ్చిదానిలా నావైపు చూస్తూ "వద్దు...వద్దు...నేను..." అంటూండగా ఆమెగొంతు పూడుకుపోయింది.

"నాకంతా తెలుసు మాధవీ! అత్తయ్య చెప్పింది... నువ్వు నాకు కావాలి."

అలాగే చూస్తుంది మాధవి.

అత్తయ్య నిన్ను చూసిన తక్షణమే నా ఎదురుగా వచ్చి కన్నీళ్ళు పెట్టుకుంది. నీలో ఆమెకు తనకూతురు 'కాంతి' కనిపించింది. అందుకే రాత్రి భోజనాలయ్యాక నీ విషయమంతా చెప్పింది, నిజంగా నేను చాలా బాధ పడ్డాను. "ఆ భగవంతుడు అమ్మాయికి అన్యాయం చేశాడు. ఇంత చిన్న వయస్సులో భర్తావియోగం కల్పించాడు. చిట్టి తల్లి బ్రతుకులో నిప్పులుపోశాడు" అంటూ అత్తయ్య ఏడ్చింది. నా దగ్గరకు వచ్చి ప్రేమగా తల నిమురుతూ "బాబూ! సారధీ నీకు అభ్యంతరం లేక పోతే ఆ అమ్మాయిని..." ఇంకేదో అనబోయింది. నేను తిరిగి అత్తయ్య వైపు చూడసాగాను. అత్తయ్య మోహం చిన్నగా మారిపోయింది. తడబడుతూ "అమ్మాయి బాగుంది కదూ!" అంది, ఏదో ఒక మాట తగలెయ్యా లన్న ఉద్దేశంతో, నేను నవ్వాపుకో లేకపోయాను. అత్తయ్య అమాయకత్వానికి నవ్వుతూ "నువ్వు చెప్పేది నాకు తెలుసు అత్తయ్యా! కాని అవిడా, ఆవిడ తల్లి

ఫోన్ నెం. 21386



చంద్రులూ ఒప్పుకోవద్దూ?" అన్నాను. "ఆ మాటన్నావు చాలు బాబూ!. నాకు చాలా సంతృప్తిగా ఉంది. అవన్నీ నాకొదిలెయ్, నేను చూసుకుంటాను" అంది.

"నువ్వేలాగైనా ఒప్పుకుంటావని తెలుసు. అందుకే నీదగ్గర ఇంత చనువు తీసుకున్నాను మాధవీ! నేనంటే నీకిష్టం లేకపోతే, నాచనువు పొరపాటయితే, నన్ను క్షమించు." అంటూ వెనక్కి తిరిగి డాబా పిట్టగోడపై కడికాలు మోపి, చేతిని గడ్డానికానించి, ఆలోచించ సాగాను.

మాధవి మెల్లగా నా ఎదురుగా వచ్చి చనువుగా తన చేతితో నాగడ్డానిపైకెత్తి లాలనగా, మెరిసే కళ్ళతో నాకళ్ళల్లోకి చూడసాగింది.

◆ ◆ ◆

మరునాడు ఉదయాన్నే వెళ్ళిపోయింది మాధవి. ఆమెను బస్సు ఎక్కించేప్పుడే "నాలుగు రోజుల్లోగా వచ్చి అమ్మా నాన్నతో మాట్లాడతానమ్మా" అంది, అత్తయ్య అందుకు మాధవి కొంటెగా "ఎందుకో"? అంది చిలిపిగా నావేపు చూస్తూ.

"ఎందుకేవిటీ?, నువ్వు నాకూతురుగా మాయింటికి రావద్దూ?" అంటూ అత్తయ్య మాధవి బుగ్గ చిదిమింది

"అబ్బ, ఏవిటమ్మా! చెంప కందిలిపోయింది" పెదవులు ముడిచి చెంప తడుముకుంటూ నావేపు చూసింది.

చిన్నగా నవ్వాను నేను. నా పెదవులు ముందుకు సాగాయి. మాధవి కళ్ళింత చేసుకొని దృష్టి మరల్చి శూన్యాన్ని చూసి వెక్కిరించింది.

ఇంతలో బస్సుకదిలింది, నేను చెయ్యి ఊపుతూ నిలబడ్డాను. కిటికీలోంచి టా...టా... చెబుతున్న మాధవి

"కథాంజలి" 40-వ జన్మదిన సంచికకు మా హృదయపూర్వకమైన అభినందనలు.

శరవణావారి ప్రత్యేకమైన

క్రొత్త పిండి రుబ్బే యంత్రము.

* ప్రస్తుతము ఎక్కువగా అమ్మబడుచున్నది.



★

కాఫిగింజలు, బియ్యం, పసుపు, మిరపకాయి, మొదలైనవన్నిటినీ పొడి చేయుట మరియు గోధుమను రవగాను, పిండిగానూ సులభముగా తయారు చేయుటకు సాటిలేనిది.

వివరములకు :

Grams: WETGRINDER    Phone: 34250, 32321

శరవణా ఇంజినీరింగ్ ట్రేడర్స్

(చింతామణి సూపర్ మార్కెట్ సమీపాన)

12/15-A, క్రిష్ణసామి మొదలియార్ రోడ్డు : : కోయమత్తూరు - 641 002.

--OSR

ఆరోగ్య సౌభాగ్యములకు మహిళలు
ఆధారపడునవి
ఆరోగ్య అనారోగ్య పరిస్థితులలో
లోధ్ర
★
గర్భపోషణకు, సుఖ ప్రసవమునకు
గర్భరక్షక
★
వేవిళ్ళకు, మలబద్ధకమునకు
మాదీఫలరసాయనం
★
ప్రసవానంతరం బలమునకు, క్షీరవృద్ధికి
సౌభాగ్యశొంఠి
★
కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్,
మద్రాసు-600 014.
ఏజెంట్లు :—
సీతారామ జనరల్ స్టోర్సు (ఏజెన్సీస్)
విజయవాడ.

చేయి కొద్ది క్షణాల్లో మరుగయిపోయింది.

"ఒక మంచిరోజు చూసి మాధవి ఊరికి వెళ్దామంది" అత్తయ్య.

ఆ మంచి రోజుకోసం ఎదురు చూస్తూండగానే ఒక రోజు మాధవి దగ్గరినుండి ఓ పొడుగాటి కవరు వచ్చింది. హుశారుగా దాన్నందుకుని అందులోని పొడుగాటి కాగితాన్ని బయటికి తీశాను.

సారిధి గారికి—

ఆరోజు డాబాపై వెన్నెల రాత్రిలో మీ కౌగిలిలో కరగి పోయాను. ఆరాత్రంతా మీరే నా మదిలో మెదిలారు. జీవితంలో మీ కౌగిలినే ప్రసాదించమని దేవుణ్ణి పదే పదే వేడుకొన్నాను. మోడువారిన నాజీవితం మళ్లీ క్రొత్త చివుళ్ళు తొడుక్కుంటుందని భావించాను. కాని... కాని ఆభగవంతుడు నా ప్రార్థనల్ని మన్నించలేదు. నేనుకోరుకున్న భాగ్యాన్ని నాకు గాకుండా దూరం చేశాడు.

నేను ఇక్కడికి వచ్చేలోగానే నాన్నగారు ఒక సంబంధం ఖాయంచేశారు. నాకు కాబోయే భర్తకు ఒక అమ్మాయి నాకంటె రెండేళ్ళు చిన్నది, అబ్బాయి నాలుగేళ్ళవాడుట, మూడు తరాల వరకూ తరగని ఆస్తుందిట ఆయన గారికి కట్నాలూ, కానుకలూ అవసరంలేదుట. పైగా పెళ్ళి ఖర్చంతా తానే భరించుకుంటా నన్నాడుట. నాన్నగారు పైసా ఖర్చులేకుండా అమ్మాయి దాటిపోతుంది కదా సంతోషంగా ఒప్పుకున్నారుట... పెళ్ళికూడా వచ్చే నెల లోనే కుదిర్చారు.

నేను నాన్నగారి నిర్ణయానికి ఎదురు గప్పలేను. ఏకాంతంగా గదిలో కూర్చొని ఏడ్చాను భారత స్త్రీని ఇంతకంటే ఏం చెయ్యగలను... మీరు గాని, మీ అత్తయ్యగానీ ఇక్కడికి వచ్చి మా నాన్నను సంప్రదించే ప్రయత్నం చేయకూడదని వేడుకుంటున్నాను. వృథా ప్రయాసతో మీరు బాధ పడటం నాకు ఇష్టం లేదు. నన్ను మరచిపోండి. మీ కాంతిని నాలో చూసుకొనే భాగ్యం మీకులేదు. నేను మిమ్మల్ని దైవంగా పూజించుకునే భాగ్యం నాకంతకంటే లేదు... మీ అత్తయ్యను అడిగినట్లు చెప్పగలరు.

మీకు కాని,
"మాధవి."

ఉత్తరం పూర్తిగా చదివి శూన్యంలోకి చూస్తూ కూర్చున్న నన్ను "ఎక్కడి నుండి బాబూ! ఆ ఉత్తరం" అంటూ లోపలినుండి వచ్చి పలకరించింది_అత్తయ్య.

"మాధవి దగ్గరినుండి"

అత్తయ్య ఉత్సుకతతో "మాధవి దగ్గరి నుండే! ఏం రాసిందో చదువు బాబూ!" అంది విప్పారిన మొహంతో.

ఉత్తరం సాంతం చదివేలోగా అత్తయ్య మొహం ముడుచుకు పోయింది. దిగులుగా "భగవంతుడు ఎంత అన్యాయం చేశాడు బాబూ! పసుపూ కుంకుమతో ఈ యింటికొచ్చి నా శాంతిని మరిపిస్తుందనుకున్నాను" అంటూ నీళ్ళు నిండిన కళ్ళతో శూన్యంలోకి చూస్తుండి పోయింది.

♦ ♦ ♦

ఏడాది కాల గర్భంలో కలిసిపోయింది — నాకు బ్యాంకులో ఉద్యోగం దొరికింది. ఈ ఏడాదిలో కొంత కాలం వరకు మాధవిని మరువ లేక పోయాను, రాత్రుల్లో కలలోకి వచ్చేది. ఆ కలలో...అదేదాబా, అదే వేప చెట్టు నీడలో వెన్నెల వెలుగులో ఆమెను అక్కున చేర్చుకొని లాలించేవాణ్ణి... పెళ్ళిపందిరికింద ఓరగా చూస్తూ తాళికట్టేవాణ్ణి, శోభనం గదిలో ఆమె సిగలోని మల్లెల గుదురులో మొహం దూర్చి. గుబాళింపులో నాసికా పుటాలు ఎగిరి పడుతుండగా మై మరచిపోయే వాణ్ణి... కొంత కాలానికి ఆ కమ్మని కలలుకూడా దూర మయ్యాయి. ఎప్పుడో ఒకసారి మాధవి మదిలో కొచ్చినా క్షణంలో మరచి పోయేవాణ్ణి.

అత్తయ్య మంచాన పడింది. తరుచుగా మంచంపై నుండి దిగాలంటేనే ఆవిడకు బ్రహ్మతర మౌతుంది.

అప్పుడప్పుడు కొన్ని పెళ్ళి సంబంధాలు కూడా వస్తున్నాయి. నాకు అప్పుడే పెళ్ళి చేసుకోవడం యిష్టం లేక ఏదో ఒకసాకు చెప్పి వాటిని తరలించేస్తున్నాను.

"బాబూ!... ఈ బొందిలో ప్రాణం ఇహ ఎంతో కాలం నిలుకదు, అదిపోయేలోగానే నీ పెళ్ళిచూడాలని, నామాటకాదనకు వచ్చిన సంబంధాలన్నీ ఇలాగే తరలించేస్తే ఆ భాగ్యం నాకెందుకు కల్గుతుంది బాబూ!" అంది అత్తయ్య అర్థింపుగా కళ్ళ నీల్లు నింపుకొని.

"ఆ మాటకు, అత్తయ్యా! ఉన్న ఒక్కగా నొక్క నువ్వు, నువ్వు పోతే ఈలోకంలో నాకిక ఎవరుదిక్కు? ఈసారేదైనా సంబంధం వస్తే తప్పకుండా చేసుకుంటాను" అన్నాను.

"అంతే చాలు బాబూ!" అంటూ తృప్తిగా నిట్టూర్చింది అత్తయ్య.

వారం తిరక్కుండానే నా కొలీగ్ సూర్యం ఒక సంబంధం మాట్లాడాడు అమ్మాయి తండ్రి తరఫున ఆయనకు దగ్గరి బంధుత్వం ఉందిట. అందుకే బాధ్యత తలపై మోపుకొని నాకు గురిపెట్టాడు. అమ్మాయి అందంగా ఉంటుందట బాగా ఆస్తి ఉందిట, కట్నం ఎంతైనా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారట.

"కట్నాలూ, కానుకలూ అంటే మహా చిరాకు. వాటిని నేనే మాత్రం ఆశించను. అమ్మాయి అందగా ఉండి,

ఎల్లప్పుడూ ప్రసిద్ధి చెందిన...
సరస్వతి బనియన్లనే ఉపయోగించండి.




Phone: 20824

**Saraswathi Banian Co.**

Dharapuram Road,

TIRUPUR - 638 604.

అంతకన్నా మంచి మనసుంటే చాలు నాకు." అన్నాను.

"నువ్వన్న లక్షణాలన్నీ ఉన్నాయామెకు" అన్నాడతను.

అత్తయ్య కాలు కదపలేని పరిస్థితిలో ఉంది.

ఒక మంచిరోజు చూసి సూర్యం నన్ను బయలదేర దీశాడు. అప్పటికే సూర్యం జాబు రాశాడేమో మేం బస్సుదిగేసరికి ఎడ్లబండి సిద్ధంగా ఉంది.

బండిలో ఊరు చేరేసరికి మధ్యాహ్నం ఒంటి గంట దాటింది. ఒక పెద్ద మేడ ముందు బండి ఆగింది. అందు లోంచి సూర్యం, నేనూ దిగి లోపలికి పోబోతుండగా, ఒక నలభైయేడేళ్ళ పెద్ద మనిషి ఎదురుగా వచ్చాడు. "మా పెదనాన్న చలపతిరావుగారు" అంటూ పరిచయం చేశాడు సూర్యం. నమస్కార, ప్రతి నమస్కార అయ్యాక లోపలికెళ్లాము. కాఫీలూ మర్యాదలూ అన్నీ జరిగాయి, ఈలోగా శాస్త్రిలుకూడా వచ్చేశాడు.

మూడు గంటలు దాటిపోయింది, నేనూ సూర్యం ఒక సోఫాలో కూర్చున్నాం. చలపతిరావుగారు మా ఎదురుగా కూర్చున్నారు.

"బాబుగారూ! అమ్మాయిని త్వరగా తయారవ్వమనండి, టైమయిపోతుంది. బైట ఒక పెళ్ళిచూసుకోవాలి" అంటూ శాస్త్రి హడావిడి పడుతున్నాడు.

పదినిముషాలు కబుర్లలో గడిచిపోయాయి...మాట్లాడుతూ, మాట్లాడుతూ "మాధవీ! అమ్మాయిని తీసుకురా!" అంటూ కేకేశారు చలపతిరావుగారు.

నా మీద పిడుగు పడ్డట్టయింది. ఒక్కసారిగా తలెత్తి, ఆయనకేసి చూడసాగాను. అంతా అయోమయంగా ఉంది.

మరోనిముషంలో అమ్మాయితో సమ్మం వరకొచ్చి, నన్ను చూసి అక్కడే శిలాప్రతిమలా నిలబడిపోయింది, మాధవి.

పెళ్ళి కూతురులా తయారై అడుగులో అడుగేసు వచ్చి, అందరికీ కాఫీలు పంచి క్రింద పరిచిన తివాచీ మీద కూర్చుంది కాబోయే పెళ్ళికూతురు.

నాదృష్టి ఆవిడపైలేదు. మాధవిపైనే కేంద్రీకృతమైంది. మాధవి అక్కడ నిలబడలేక విసురుగా లోపలికెళ్ళిపోయింది.

"ఓకే" అంటూ మోచేతితో పొడిచాడు సూర్యం.

నేను ఒక్కసారిగా ఉలికి పడ్డాను

"ఏరా! అబ్బాయి మాటైనా మాట్లాడలేదు అమ్మాయి పేరైనా అడగలేదు, "ఓకే" అంటావేమిటి?" అంటూ సూర్యాన్ని వారించాడు చలపతిరావుగారు.

మనస్సు నాస్వాధీనంలో లేదు. దృష్టి దూత్రం ఆవిడపైకి మళ్ళింది. అప్రయత్నంగా "పేరు" అన్నాను.

"కల్పన" అంటూ సిగ్గుతో ముడుచుకుపోయింది.

ఐదు నిముషాల వరకు నా నోటంట మరే మాట రాలేదు.

చలపతిరావుగారే కల్పించుకొని "అమ్మాయి నింకేమైనా అడుగు బాబూ! అలా అయిపోతున్నావేమిటి?" అన్నారు.

"అబ్బే ఏంలేదు, ఏంలేదు......" అంటూ మామూలుగా ఉండటానికి ప్రయత్నించాను.

"ఐతే, ఓకే?" అని అరుచుకుని నన్ను తనవైపు తిప్పుకున్నాడు సూర్యం.

కలవర పడుతున్న మనసును జయంచేసి "ఓకే" అంది నా గొంతు.

"కథాంజలి"లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రము బాధ్యులుకాదు. —సంపాదకుడు.

